క్లుప్తంగా

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు ప్రారంభం

హాలియా : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని హాలియా ఉన్నత పాఠశాల కో ఆర్డినేటర్ గుండా కృష్ణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ఒక వరంలాంటిదన్నారు. ఓపెన్ స్కూల్‌లో చేరే విద్యార్థులు ఈనెల 8వ తేదీ నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు అడ్మిషన్లు పొందాలన్నారు. ఓపెన్ టెన్త్ అడ్మిషన్ల కోసం ప్రవేశం పొందే విద్యార్థులు రికార్డు షీట్, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఫొటో సమర్పించాలని, ఇంటర్ కోర్సులో చేరే విద్యార్థులు పదో తరగతి పాస్ మెమో, టీసీ, కులధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, ఫొటోతో జతచేయాలన్నారు. పూర్తి వివరాల కోసం 9010750686 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా : హాలియా సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని ఏఈ బాలునాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలో అనుముల ఫీడర్ బ్రేకర్ మార్పిడి ఉన్న కారణంగా ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఫీడర్ కింద విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అనుముల, అనుములవారిగూడెం, ఈశ్వర్ నగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండద న్నారు. విద్యుత్ గృహ, వాణిజ్య వినియోగ దారులు, రైతులు విద్యుత్ సిబ్బందికి, అధికారులకు సహకరించాలని కోరారు.

అడవిదేవులపల్లిలో..

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లు మార్పు ఉన్నందున సోమవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ ఎల్. శ్రీను ఆదివారం తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని అడవిదేవులపల్లి, ఉల్సాయిపాలెం, ముదిమాణిక్యం, గోనియాతండా, హాముతండ, తాటిచెట్టు తండాలతో పాటు తదితర గ్రామాల పరిధిలో ఉన్న గృహాలు, వాణిజ్య వినియోగదారులు విద్యుత్ అంతరాయంను గుర్తించి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

ముగిసిన వినియోగదారుల అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నాగార్జునసాగర్ : వినియోగదారుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దశాబ్ది ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువుల తూకాల దగ్గరినుండి ప్యాకేట్లలో జరిగే మోసాలు, కొలతలలో పెట్రోల్‌బంకులలో జరిగే మోసాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఎం.ఎస్‌కె జైస్వాల్ కొడిమూరి నారాయణరెడ్డి, తెలంగాణ రాష్ట్ర రేరా చైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ స్టేట్ డైరెక్టర్ పీవీ శ్రీకాంత్ తదితరులు మాట్లాడారు. వీరితో పాటు కట్ట మనోహర్, రవి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కాన్వాయ్‌ని అడ్డుకున్న గ్రామస్తులు



మంత్రి కాన్వాయ్‌ని అడ్డుకుంటున్న గ్రామస్తులు

మిర్యాలగూడ : అడవిదేవులపల్లి మండలంలోని చిట్యాల వద్ద నిర్మిస్తున్న దున్నపోతుల గండి ఎత్తిపోతల పథకం పనులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరిశీలించి తిరిగి వెళ్తున్న క్రమంలో చిట్యాల గ్రామస్తులు మంత్రి కాన్వాయ్‌ని అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. టెయిల్‌పాండ్ నిర్మాణంతో తమ గ్రామం ముంపునకు గురైందని, నిర్వాసితులమైన తమకు పూర్తి స్థాయిలో పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తమకు తాగునీటిని అందించడం లేదని, ఇళ్లలోకి పాములు, తేళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, పోలీసు అధికారులు గ్రామస్తులకు సర్దిచెప్పడంతో నిరసన విరమించారు.

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రం

నేరేడుచర్ల : కేంద్ర ప్రభుత్వం రైతు, ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏఐవైఎఫ్ పట్టణ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, దోమకొండ సురేష్, కర్నాటి నర్సిరెడ్డి, రైతు సంఘం సభ్యులు, నాయకులు తదితరులున్నారు.

నీళ్లిచ్చే కాల్వలపై నిర్లక్ష్యం!

కంపచెట్లు, పూడికతో నిండిన ఏఎమ్మార్పీ కాల్వలు

- నిధుల కొరతతో మరమ్మతుల్లేవు
- పది రోజులు గడిచినా నీరు చేరలేదు



డీ 23 పరిధిలో చామలోనిబావి సమీపంలో కంపచెట్లతో నిండిన కాల్వ



డీ 24లో కొప్పోలు సమీపంలో ఇలా అడ్డుకట్ట వేసినా తూముకు అందని నీరు

గుర్రంపోడు : ఏఎమ్మార్పీ కాల్వలు దశాబ్దాలుగా మరమ్మతులు నోచుకోక కంపచెట్లు, పూడికలతో ఉనికి కోల్పోతున్నాయి. కాల్వలు, కార్యాలయాల నిర్వహణకు నిధుల లేక కాల్వల్లో నీరు పంట పొలాలకు చేరడం లేదు. పది రోజులుగా అసలే అరకొరగా విడుదల చేస్తున్న నీటితో అధ్వానంగా ఉన్న కాల్వలతో మైనర్ కాల్వలకు నీరు చేరకపోగా 18 కిలోమీటర్ల పొడవునా గల డీ–25 మేజర్‌లో 17 కిలోమీటర్ల పొడవు గల డీ 19 మేజర్ కాల్వల్లో చివరకు నీరు ఎలా చేరడం లేదు. ప్రస్తుతం రెండు, మూడు కిలోమీటర్లు మించి నీరు ప్రవహించని పరిస్థితి ఉంది.

దశాబ్దాలుగా మరమ్మతుల్లేవు

మండలంలో డీ 16, డీ25 వరకు గల డిస్ట్రిబ్యూటరీ కాల్వలు చివరకు నీరు చేరే అవకాశం లేకుండా ఉన్నాయి. ఏఎమ్మార్పీ ప్రాజెక్టు పనుల్లో మొదటగా 1994లో తవ్విన డీ 23, డీ 24 కాల్వలు పూర్తిగా దెబ్బతినగా 40ఏళ్లుగా మరమ్మత్తులు లేవు. 2004లో డీ19, డీ22, డీ25ల నిర్మాణాలకు సంబంధించి ప్యాకేజీ కంట్రాక్టరే మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా అక్కడక్కడా అసంపూర్తి పనులు, పంట కాల్వలు తవ్వకుండానే పనులు ముగించాడు. దీంతో కాల్వల్లో పూడికలు నిండి చివరకు నీరు చేరని పరిస్థితి నెలకొంది. గతంలో వేసవిలో ఖరీఫ్‌కు ముందు ప్రతి యేటా మరమ్మతులు చేయడం, కంపచెట్లు తొలగించేవారు. మూడేళ్లుగా ఎలాంటి మరమ్మతు పనులు నిధులు లేవంటూ చేపట్టడం లేదు. డివిజన్ కార్యాలయం శిథిలావస్థలో ఉండి అధికారులకు ఏళ్ల తరబడి టీఏ బిల్లులు కూడా అందని పరిస్థితుల్లో మరమ్మతులకు నిధులు మంజూరుపై ఆశలు లేవని అధికారులు అంటున్నారు. కాల్వ వెంబడి రహదార్లు మూసుకుపోయాయి. దీంతో సరకు రవాణాకు ఇబ్బంది ఉంది. కాల్వకు రెండు వైపులా ఉండాల్సిన రహదారులు ఒక వైపు పూర్తిగా మూసుకునిపోయి ఉన్నాయి.

పూడిపోయిన కాల్వలు

మండలంలో డీ 20, 21, 19, 25 లలోని గుర్రంపోడు, చేపూరు, కొప్పోలు పరిధిలో నల్ల రేగడి భూముల్లో కాల్వలు పూడిపోయాయి. నీరు వదిలే ప్రతిసారి రైతులు కాల్వల్లో పూడిక తీయించుకోవాల్సి వస్తుంది. నల్ల రేగడి కాల్వల్లో సిమెంట్ కాంక్రీట్ చేయాల్సి ఉంది. ఐతే అక్కడక్కడ మాత్రం పల్లిపహాడ్, తెరాటిగూడెం పరిధిలో మాత్రమే లైనింగ్ చేశారు. పూడిన కాల్వలన్నింటిని పూడికలు తొలగిస్తేనే ఖరీఫ్‌లో చివరకు నీరందే వీలుంటుంది. మండలంలోని డీ 25 కాల్వ అక్కడక్కడ దెబ్బతినడంతో చివరకు నీరందని పరిస్థితి ఉంది. 18 కిలోమీటర్ల పొడవు గల డీ 22 పరిధిలోని కాల్వ మొసంగి, కొత్తలాపురం పరిదిల్లో కంపచెట్లతో మూసుకుపోయి నీరు పారడం లేదు.

కాల్వల మరమ్మతులు చేపట్టాలి



ఆయకట్టులో ఏఎమ్మార్పీ కాల్వల్లోకి నీరు చేరడం లేదు. ప్రధాన కాల్వలో సరిపడా నీరు విడుదల కాక, కాల్వలో పూడికతీయకపోవడంతో నీరు పంటపొలాలకు చేరడం లేదు. కాల్వలోని కంపచెట్లు, పూడికలు తొలగించాలి. నల్లరేగడి నేలల్లో లైనింగ్‌లు చేపట్టాలి. మొట్టమొదటగా తవ్విన డీ 23, డీ–24 కాల్వల మరమ్మతులు తక్షణమే చేపట్టాలి.

– రేపాక లక్ష్మీపతి, రైతు సంఘం నాయకుడు, గుర్రంపోడు

ప్రతిపాదనలు పంపిస్తున్నాం



మేజర్, మైనర్ కాల్వల్లో కంపచెట్లు, పూడికల తొలగింపు శాఖపరంగా నిధుల మంజూరు కాలేదు. ఉపాధి హామీ పథకం ద్వారా అక్కడక్కడ కాల్వల్లో కంపచెట్లు తొలగించారు. డివిజన్ కార్యాలయం, క్యాంపు కాలనీ నిర్వహణలకు నిధుల కొరత ఉంది. అత్యవసరమైన పనులకు నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపుతున్నాం.

– ఆనందరావు, డీఈఈ

ప్రజలు మూఢనమ్మకాలను విశ్వసించొద్దు



మూఢనమ్మకాలపై అవగాహన కల్పిస్తున్న జేవీవీ సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : శాస్త్ర సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న సమాజంలో మూఢనమ్మకాలను ఎవరూ విశ్వసించొద్దని జేవీవీ ప్రతినిధి కోలా శ్రీనివాస్, పాదూదరి రమణారెడ్డి, సైన్స్ ప్రచార సంస్థ కన్వీనర్ బక్క శ్రీనివాస్‌చారి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న వేప చెట్టు కింద కొన్ని మంత్రించిన కొబ్బరి కాయలను అమావాస్య రోజు పెట్టారని అక్కడి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న జేవీవీ సంస్థ ప్రతినిధి సంఘటన స్థలాన్ని పరిశీలించి మాట్లాడుతూ ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలు ఇలా భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిని గుర్తించి ప్రభుత్వం కఠినంగా శిక్షించాలన్నారు. అనంతరం ఆ సంస్థల ప్రతినిధులు ఆమావాస్య రోజున పగులకొట్టిన కొబ్బరి కాయలను తిని ప్రజలకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా మాజీ అధ్యక్షులు గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అమరయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఉదయ్‌కుమార్. రేణు, రామయ్య తదితరులున్నారు.

డిండి, ఎస్ఎల్‌బీసీని పూర్తిచేయాలని వినతి



మంత్రి ఉత్తమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

డిండి : డిండి ఎత్తిపోతల పథకంతోపాటు ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని పూర్తిచేసి దేవరకొండ, మునుగోడు ప్రాంతాలకు సాగు, తాగునీటిని అందించాలని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు.ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఇరిగేషన్ ప్రాజెక్టుల సమీక్షా సమావేశానికి హాజరైన మంత్రికి విన్నవించారు. అనంతరం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ డిండి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం డీపీఆర్‌ను ఆమోదించకపోవడం, పర్యావరణ అనుమతులు తీసుకోక పోవడం తోపాటు భూ నిర్వాసితులకు నష్ట పరిహారం కూడా చెల్లించలేదదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల విషయంలో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనైనా డిండి, ఎస్ఎల్‌బీసీని పూర్తి చేయాలని ఆయన మంత్రిని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.వెంకటరమణ, కమిటీ సభ్యుడు తూం బుచ్చిరెడ్డి, ఎండీ మైనొద్దిన్, బొల్లే శైలేష్, ప్రభాకర్‌రావు, రంగారెడ్డి పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

హాలియా : కేరళలోని వయనాడ్ వరద బాధితులకు ప్రతి ఒక్కరూ ఆర్థిక సహకారం అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు అన్నారు. ఆదివారం హాలియా పట్టణంలో కేరళ వరద బాధితుల కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో విరాళాలను సేకరించి జిల్లా కమిటీకి పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోవాల్సింది పోయి ప్రకృతి వైపరీత్యాలను కూడా రాజకీయం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, గొర్రె రమేష్, సీఐటీయూ నాయకులు వెంకన్న, లక్ష్మమ్మ, వెంకటమ్మ, నారమ్మ, సాయి, హర్షిత్, శివ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ పోరాటాలతోనే బదిలీలు



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): టీఎస్‌యూటీఎఫ్ చేసిన కృషి, పోరాటాలతోనే ప్రభుత్వం బదిలీలు, పదోన్నతులు చేపట్టిందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పేరుమాళ్ల వెంకటేశం తెలిపారు. మండలంలో పనిచేసి ఇటీవల పదోన్నతి, బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన టీఎస్‌యూటీఎఫ్ సభ్యుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. అనంతరం వెంకటేశం మాట్లాడుతూ ప్రతి యూటీఎఫ్ కార్యకర్త నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని సూచించారు. బదిలీలు, పదోన్నతులపై ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పటికి ఇదే అంకిత భావంతో పనిచేసి సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. మండల అధ్యక్షుడు ఎరనాల సైదులు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంఘం నాయకులు రాజు, శ్రీదేవి, శ్రీనివాస్‌రెడ్డి, సరోజినిదేవి, బివిరావు, సైదయ్య, రమణ, మోతీలాల్, కృష్ణ, ప్రశాంత్, సైదయ్య, విజయలక్ష్మీ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సహాయ వంట మనిషి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఒక సహాయ వంట మనిషి పోస్టుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ మాత్యనాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడో తరగతి పాసై, కొండమల్లేపల్లి మండలానికి చెందిన వారై ఉండి అనుభవం కలిగిన మహిళలకు ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్. 8074490842కు సంప్రదించాలని కోరారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

హాలియా : ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుజాత ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. అనుముల మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీక స్వీకరించనున్నట్లు తెలిపారు.

దళితుల సంక్షేమమే బీజేపీ ధ్యేయం



ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన నాగరాజును సన్మానిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : దళితుల సంక్షేమమే బీజేపీ ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని సాగర్ రోడ్డులోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు బీజేపీ దళిత మోర్చా, బీజేపీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నూతనంగా దళిత మోర్చా జిల్లా కార్యదర్శిగా ఎన్నికైనా ఉబ్బపల్లి నాగరాజు(నంద)ను ఘనంగా సత్కరించారు. అనతరం ఆయన మాట్లాడుతున్న తన ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సరిత, నాయకులు సత్యప్రసాద్, బంటు సైదులు, శ్యాం, ఆజిరెడ్డి, రవిబాబు, యాదగిరి, మధన్‌మోహన్, అజయ్, సోములు, బిక్షం, సోములు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ బోనాలు



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : పట్టణంలోని ఈదులగూడలో ముత్యాలమ్మ పరమేశ్వరి అమ్మవారి బోనాల మహోత్సవాలు ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, పాడి పంటలతో కళకళలాడాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బండి యాదగిరిరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్: ఎస్సీ వర్గీకరణకు కృషి చేసిన మంద కృష్ణ మాదిగ ఈ నెల 13న హైదరాబాద్‌కు వస్తున్న నేపథ్యంలో నిర్వహించనున్న విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెరిగి శ్రీశైలం, ఎంఈఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపాక వెంకన్న పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానికంగా జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో గాదె రమేష్, లంకపల్లి నరేష్, రమణ భార్గవ్, గట్టు మల్లయ్య, మోహన్, దేవయ్య, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బకరం శ్రీనివాస్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చింతపల్లి : చింతపల్లి మండలంలోని మాల్ వెంకటేశ్వరనగర్ జెడ్పీహెచ్ఎస్ 2007–2008 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు తమ పాఠశాల నాటి అనుభవాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం మహమ్మద్ అన్వర్, రేణుక, అంగిరేకుల రాజు, విద్యార్థులు బాల్‌రాజు, శ్రీనివాస్, ప్రదీప్‌కుమార్, వెంకటేష్, దేవి, లావణ్య, సువర్ణ, రఘు, రామాచారి, సద్దాం పాల్గొన్నారు.

నీలగిరిని నేర రహిత పట్టణంగా తీర్చిదిద్దాలి

నల్లగొండ క్రైం: నీలగిరిని నేర రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని వన్ టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, టూటౌన్ సీఐ డానియెల్ కోరారు. ఆదివారం నంబర్ ప్లేట్లు లేని, మైనర్లు డ్రైవింగ్ చేస్తున్న 6 కార్లు, 2ఆటోలు, 44 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై 54 కేసులు నమోదు చేశామని తెలిపారు. అనంతరం వాహనదారులకు కౌన్సిలింగ్ చేశారు.



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ : విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం పట్టణంలోని మాన్యంచెల్క బహదూర్ ఖాన్ కమ్యూనిటీ హాల్లో ఉర్దూ మీడియం స్కూల్ పేద విద్యార్థులకు ఆయన ఉచితంగా నోటు పుస్తకాలు అందజేసి మాట్లాడారు. కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ట్రస్టు ద్వారా బహదూర్‌ఖాన్ ఆధ్వర్యంలో తక్కువ ఫీజులతో స్కూల్ స్థాపించడానికి మంత్రి కోమటిరెడ్డితో చర్చించి ప్రభుత్వ స్థలం వచ్చే విధంగా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మొహ్మద్ ఝహేద్ హుస్సేన్, ముంతాజ్ ఖురేషి, మొహమ్మద్ కలీం, షఫీ నవాస్ ఖాన్, షాహిద్ అహ్మద్, మౌజామ్ హుస్సేన్, ఎంఎం వాసిక్, నుసురత్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

శివశంకర్ జీవితం స్ఫూర్తిదాయకం



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : కేంద్ర న్యాయశాఖ మాజీ మంత్రి దివంగత పుంజాల శివశంకర్ జీవితం స్ఫూర్తిదాయకమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు దూళిపాల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పట్టణంలో సంఘం ఆధ్వర్యంలో శివశంకర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడారు. శివశంకర్ అత్యంత పేద కుటుంబంలో జన్మించి ఉన్నత విద్యను అభ్యసించి న్యాయవాదిగా, న్యాయమూర్తిగా, కేంద్ర న్యాయశాఖ మంత్రిగా, పలు రాష్ట్రాల గవర్నర్‌గా సేవలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు చేపూరి నరసింహచారి, నాయకులు బి.నాగేశ్వరావు, ఎం.వెంకటేశ్వర్లు, కె.శేఖర్, ఎం.సైదయ్య, కె.శ్రీనివాస్, టి.వెంకన్నగౌడ్, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు

- మున్సిపాలిటీలో వారానికొక రోజు డ్రై డే
- నీటి నిల్వలు తొలగించేలా ప్రజలకు అవగాహన



మురుగు నీటిలో ఆయిల్ బాల్స్ వేయిస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

దేవరకొండ : ఈ కాలం సీజనల్ వ్యాధులు ముసిరే సమయం. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వ్యాధులు మరింత విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని మున్సిపాలిటీలో ప్రతి వారం ఒక రోజు డ్రై డే పాటించాలని మున్సిపల్‌శాఖ నిర్ణయించింది. ప్రస్తుత కాలంలో నీటి తొట్టెలు, పూల కుండీలు, టైర్లు, కొబ్బరి చిప్పలు, వాడి పారేసిన టైర్లు తదితర వాటిలో వర్షపునీరు నిల్వ ఉండి దోమల లార్వా వృద్ధి చెందే అవకాశం ఉంది. ఈ సమస్యను తక్షణం అధిగమించేందుకు పురపాలకశాఖ ప్రతి ఇంట్లో ఎవరికి వారు స్వతహాగా డ్రై డే పాటించాలని సూచిస్తూ కార్యాచరణను రూపొందించి అమలు చేస్తోంది.

మున్సిపాలిటీలో ఇలా..

దేవరకొండ మున్సిపాల్టీ పరిధిలో మొత్తం 20 వార్డులు ఉన్నాయి.48వేల జనాభా ఉంది.కాగా దేవరకొండ పట్టణానికి ప్రతి నిత్యం ఇతర పట్టణాలు, గ్రామాల నుండి నిత్యం వందల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అంతేగాకుండా వాణిజ్యపరంగా దేవరకొండ అభివృద్ధి చెందుతుంది. ప్రతి నిత్యం పట్టణంలోని వాణిజ్య సముదాయాలు, గృహాల నుండి దాదాపు 16 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరిస్తుండగా రెండు మెట్రిక్ టన్నుల చెత్తను కంపోస్ట్ తయారీకి తరలిస్తుండగా మరికొంత చెత్తను డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. అయితే పారిశుద్ధ్యంపై ప్రత్యేక దష్టి సారించి పుర ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం..

ప్రస్తుత తరుణంలో సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు. వానాకాలంలో దోమల కారణంగా మలేరియా, డెంగీ కేసులు ప్రబలే అవకాశం లేకపోలేదు. ఆడ అనాఫిలిస్ దోమ ద్వారా మలేరియా వ్యాపిస్తోంది. ఈ దోమ ఎక్కువగా మురుగునీటిలో పెరుగుతుంది. మున్సిపాలిటీలల్లో మురుగు నీరంతా మడుగులు కట్టి దోమల విజంభృణకు కారణమవుతోంది. వాడి పారేసిన కొబ్బరి బొండాలు, టీ కప్పులు, చిప్పల్లో నీరు నిల్వ ఉంటోంది. వీటిలో నీరు నిలిచి డెంగీకి కారణమయ్యే దోమ వృద్ధి చెందుతుంది.

దోమల నివారణ చర్యలు..

ప్రస్తుతం వృద్ధి చెందుతున్న దోమల నివారణ చర్యలపై ఇప్పటికే సంబంధిత మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని పలు కాలనీల్లో పారిశుద్ధ్య పనులతో పాటు ఆయా ప్రాంతాల్లో కాల్వల పూడిక, వ్యర్థాలను తొలగిస్తున్నారు. మురుగు నీరు నిల్వ ఉన్న గుంతల్లో ఆయిల్ బాల్స్ వేసి దోమల లార్వాను నియంత్రించేందు చర్యలు చేపట్టారు.అలాగే మురుగు కాల్వల్లో మందుల పిచికారీ చేపట్టి ప్రధాన ప్రాంతాలు, కాలనీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలుపుతున్నారు.ఇదిలా ఉంటే అవసరమైన ప్రాంతాల్లో వెంటనే ప్రత్యేక వైద్య, ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మున్సిపాలిటీ పారిశుద్ధ్య విభాగం తరఫున అన్ని రకాల చర్యలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో నీటి నిల్వ ఉంటే తొలగించాలి. నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలి. దోమలను నియంత్రణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వారంలో ఒక రోజు డ్రై డేను తప్పకుండా పాటించాలి.తడి,పొడి చెత్తను వేర్వేరుగా చెత్త సేకరణకు వచ్చే వాహనాలకు అందించాలి.

– భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, దేవరకొండ